సాక్షి
ప్రకాశం
ఆదివారం । 8 । అక్టోబర్ । 2023



ఆర్టీసీకి జీవం జగన్

ఆర్టీసీకి జీవం జగన్ అనే నినాదం కార్మికులు, ఉద్యోగుల్లో నెలకొందని నేషనల్ యూనిటీ మజ్దూర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు అన్నారు. - 8లో..



సెజ్‌లో ఎగుమతులు పెంచుకోవాలి

సెజ్‌లో గ్రానైట్ ఎగుమతులు పెంచుకోవాలని వైజాగ్ సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాస్ కోరారు. - 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
38.2/26.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోత అధికం. వాతావరణం పొడిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

10న ఎస్‌జీఎఫ్ క్రీడాజట్ల ఎంపిక

ఒంగోలు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 10న టెన్నికాయిట్, బాస్కెట్‌బాల్, క్రికెట్ జిల్లా జట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, అండర్ 17 విభాగంలో జరిగే ఈ పోటీలు టంగుటూరు మండలం ఆలకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. పూర్తి వివరాలకు పీడీ పి.వెంకట్రావు సెల్ 9010090464 నంబర్‌ను సంప్రదించాలి. అండర్ 14 క్రికెట్ బాలబాలికల జట్ల ఎంపిక గిద్దలూరులోని ఆదర్శ బీఈడీ కాలేజీ ఆవరణలో నిర్వహిస్తారు. ఉదయం 9 గంటలకు ఆదర్శ బీఈడీ కాలేజీ పీడీ జి.శోభన్‌బాబు సెల్ : 9618801191 నంబర్‌ను సంప్రదించాలి. బాస్కెట్‌బాల్ అండర్ 14, అండర్ 17 బాల బాలికల జట్ల ఎంపిక కందుకూరులోని టీఆర్ఆర్ జూనియర్ కాలేజీలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తారు. పూర్తి వివరాలకు పీడీ టి.సుబ్బారావు సెల్: 9866126955 నంబర్‌ను సంప్రదించాలి. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి జిల్లాలోని 56 మండలాల్లోని విద్యార్థులు అర్హులు. ఆసక్తిగల విద్యార్థులతో పీఈటీ/పీడీలు ఆన్‌లైన్ ఎంట్రీ చేసుకుని మాన్యువల్ ఎంట్రీ ఫారంలతో సెలక్షన్స్‌కు విద్యార్థులు హాజరయ్యేటట్లు చూడాలన్నారు. అండర్ 17 కేటగిరీలో పాల్గొనే ఇంటర్ విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబర్, సంబంధిత ప్రిన్సిపాల్ ధ్రువీకరణతో నిర్వాహకులకు సమర్పించి పాల్గొనాలని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ తెలిపారు.

డీఎల్‌పీఆర్‌వోగా దుర్గా ప్రసాద్



కలెక్టర్ దినేష్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎల్‌పీఆర్‌వో దుర్గాప్రసాద్

ఒంగోలు అర్బన్: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో ఏపీఆర్‌వో (సహాయ పౌర సంబంధాల అధికారి)గా పనిచేస్తున్న దాసరి దుర్గాప్రసాద్‌రావుకు డీఎల్‌పీఆర్‌వో (డివిజనల్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి)గా పదోన్నతి లభించింది. ఆ మేరకు శనివారం బాధ్యతలు చేపట్టిన ఆయన కలెక్టర్ దినేష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది దుర్గాప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

నేడు అపుస్మా జిల్లా సర్వసభ్య సమావేశం

ఒంగోలు: ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం స్థానిక ఎన్‌టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు అపుస్మా జిల్లా అధ్యక్షుడు కె.మాధవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం అనంతరం నూతన ఉపాధ్యాయ ఎమ్మెల్సీలు ఎంవీ రామచంద్రారెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డిలను సత్కరించడంతో బాటు ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏకేయూలో పీజీసెట్ అడ్మిషన్లు

ఒంగోలు: స్థానిక ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో పీజీ సెట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ జి.సోమశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ సెట్ క్వాలిఫై అయి సీటు పొందలేకపోయిన విద్యార్థులు ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలో డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. తమ వద్ద ఎంఎస్సీ విభాగంలో ఆక్వాకల్చర్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎనాలిటికల్ కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, మేథమేటిక్స్, స్టాటిస్టిక్స్, ఎంఏ విభాగం నుంచి ఎకనామిక్స్, ఇంగ్లిష్, హిస్టరీ, తెలుగు, ఎంకాం , ఎంఎస్‌డబ్ల్యూ, ఎంఈడీ, ఎంపీఈడీ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. పూర్తి వివరాలకు 9949088109, 8978496178 సెల్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అన్నదాతకు అండగా..

అనేక సంక్షేమ పథకాలతో అన్నదాతలను ఆదుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం వారికి మరిన్ని సేవలు చేరువ చేసేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల మొదలు..ఆధునిక యంత్రాలు..సాగులో మెళకువలు..చివరకు సరైన మద్దతు ధరకు పంటను అమ్ముకునే వరకు అడుగడుగునా వారికి సాయపడేలా ప్రభుత్వ యంత్రాంగాన్ని గ్రామస్థాయికి చేర్చింది. శాశ్వత భవనాలతో..సమగ్ర సేవలతో ఆర్బీకేలు రైతులను ఆదుకునే దేవాలయాలుగా మన్ననలు అందుకుంటున్నాయి.

- జిల్లా వ్యాప్తంగా 616 రైతు భరోసా కేంద్రాలు
- 330 ఆర్‌బీకేలకు శాశ్వత భవనాల ఏర్పాటు
- 4233 టన్నుల ఎరువుల పంపిణీ
- 3,90,129 కిలోల విత్తనాల అందజేత

మార్కాపురం: వ్యవసాయాన్ని దండగగా భావించి నిర్లక్ష్యం చేసిన టీడీపీ ప్రభుత్వంలో ఇబ్బందులు పడిన రైతులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటూ వ్యవసాయాన్ని పండుగలా మార్చింది. గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు అన్నివిధాలుగా ఆదుకుంటున్నాయి. విత్తన సరఫరా నుంచి విక్రయం వరకూ రైతులకు అండగా నిలుస్తున్నాయి. వివిధ రాష్ట్రాల నుంచి ప్రభుత్వ రైతు సంఘాల ప్రతినిధులు ఇక్కడికి వచ్చి ఆర్‌బీకేల పనితీరును, సేవలను పరిశీలించి శభాష్ అంటూ మెచ్చుకుంటున్నారు.

సేవలు ఇలా...

జిల్లా వ్యవసాయ శాఖ పరిధిలో మార్కాపురం, యర్రగొండపాలెం, ఒంగోలు, కనిగిరి, గిద్దలూరు, దర్శి, సింగరాయకొండ సబ్‌డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 36 మండలాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 616 రైతు భరోసా కేంద్రాలున్నాయి. ఇందులో కియోస్క్ మిషన్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రైతులు తమకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను బుక్ చేసుకుంటే నేరుగా ఇంటివద్దకే వచ్చే ఏర్పాట్లు చేశారు. గతంలో వ్యవసాయ సంబంధిత ఉత్పత్తులు, విత్తనాల కోసం రైతులు మండల కేంద్రాలకు వచ్చి ధర్నాలు చేసేవారు, అయితే నాలుగేళ్లుగా రాష్ట్రంలో ఎక్కడా విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం ధర్నాలు చేసిన సంఘటనలు లేవు.

విత్తనాల సరఫరా ఇలా...

జిల్లా మొత్తం మీద ఖరీఫ్‌లో జీలుగలు 73,660 కిలోలు, జనుము 2,01,830 కిలోలు, పిల్లిపెసర 34,680 కిలోలు, కందిలో ఎల్‌ఆర్‌జీ 52 రకం 204 కిలోలు, పెసరలో ఐపీయూ 2-43 రకం 5960 కిలోలు, పీయూ-31 రకం 1976 కిలోలు, టీబీజీ 104 రకం 9825 కిలోలు, ఒడ్లు బీపీటీ 5204 రకం 14575 కిలోలు, ఎన్‌ఎల్‌ఆర్ 33892 రకం 46860 కిలోలు పంపిణీ చేశారు. మొత్తం మీద 3,90,129 కిలోల విత్తనాలు సరఫరా చేశారు.

ఎరువుల సరఫరా ఇలా...

ఖరీఫ్‌లో జిల్లా మొత్తం మీద ఉన్న రైతు భరోసా కేంద్రాల ద్వారా 4233.34 టన్నుల ఎరువులను రైతులకు అందించారు. ఇందులో యూరియా 14-35-14, 28-28-0, 10-26-26, డీఏపీ, సూపర్ పాస్ఫేట్ తదితర ఎరువులు ఉన్నాయి. ఇవి కంది, మిర్చి, వరి, పొగాకు వంటి పంటల సాగుకు ఉపయోగపడుతున్నాయి. వివిధ దశల్లో పైర్ల ఎదుగుదలకు సహకరిస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఈ ఎరువుల కోసం రైతులు ధర్నాలు చేయగా.. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల ద్వారా కల్తీలేని నాణ్యమైన ఎరువులు, విత్తనాలు సరఫరా అవుతున్నాయి.



నాయుడుపల్లి రైతుభరోసా కేంద్రం



మార్కాపురంలో ఆర్బీకే ద్వారా విత్తనాలు అందిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి (ఫైల్)



దొనకొండ మండలం ఆరవెళ్లపాడు ఆర్బీకేలో ఎరువులను తనిఖీ చేస్తున్న ఏడీఏ బాలాజీ, ఏఓ లక్ష్మీ నారాయణ (ఫైల్)

నాణ్యమైన విత్తనాలు అందజేత



జిల్లా వ్యాప్తంగా మొత్తం 616 రైతు భరోసా కేంద్రాలుండగా, ఇందులో 330 రైతు భరోసా కేంద్రాలకు భవనాలు పూర్తయ్యాయి. మా సిబ్బంది ఇక్కడే ఉండి గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో రైతులకు అవసరమైన సలహాలు సూచనలు ఇవ్వడంతోపాటు నాణ్యమైన విత్తనాలు అందజేస్తున్నారు. ప్రధానంగా ఈ సీజన్‌లో జీలుగ, జనుము, పిల్లిపెసర, కంది, వరి విత్తనాలు అందించాం. రబీ సీజన్‌లో అవసరమైన విత్తనాలు కూడా అందిస్తాం. రైతు భరోసా కేంద్రాల సేవలను రైతులు ఉపయోగించుకోవాలి.

– శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు

నాణ్యమైన ఎరువులు



రైతు భరోసా కేంద్రాల ద్వారా ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందజేస్తున్నాం. ఇందులో ప్రధానంగా పత్తి, మిర్చి, వరిసాగుకు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు, సూపర్ పాస్ఫేట్ ఎరువులు అందించాం. ఇంకా రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి ఇబ్బందీ లేదు. అవసరమైతే ఇంకా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు ఉపయోగించుకోవాలి.

– శ్రీనివాసరెడ్డి, ఏఓ

రైతుభరోసా కేంద్రాలు ఉపయోగకరంగా ఉన్నాయి



గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు మాలాంటి రైతులకు చక్కగా ఉపయోగపడుతున్నాయి. పత్తి, మిర్చి సాగు చేశాను. వీటికి అవసరమైన ఎరువులను ఆర్‌బీకే ద్వారా తెప్పించుకున్నాను. గతంలో మార్కాపురానికి వెళ్లి తెచ్చుకోవాలి. ఇప్పుడు మా ఊరిలోనే ఆర్‌బీకేలో అందుతున్నాయి.

– అంబటి చెన్నారెడ్డి, రైతు, కోలభీమునిపాడు

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

- ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అర్బన్ హెల్త్ సెంటర్లను పెంచుతున్నాం
- ఒంగోలు నగరాన్ని వేగంగా అభివృద్ధి చేస్తున్నాం
- విశాలమైన రోడ్లు, మురుగునీటి వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు పోతున్నామని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఒంగోలు నగరంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను శనివారం బాలినేని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు తగ్గట్టుగా మౌలిక వసతులను పెంచుకుంటూ పోతున్నామన్నారు. పెరుగుతున్న నగరాన్ని దృష్టిలో ఉంచుకొని ఒంగోలు నగరాన్ని వేగంగా అభివృద్ధి చేస్తున్నామని, పర్యావరణాన్ని కాపాడేలా చర్యలు చేపడుతూ పచ్చదనాన్ని విస్తృతం చేస్తున్నామని పేర్కొన్నారు. ఒంగోలు నగరాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. అందుకోసం నగరంలోని అన్ని మున్సిపల్ డివిజన్లలో రూ.కోట్లు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఒంగోలు నగరంలోని చెత్త సేకరణను ఉధృతం చేశామన్నారు. అందులో భాగంగా నగర పరిధిలోని 18వ డివిజన్ కొత్త మామిడి పాలెంలో రూ.1.20 కోట్లతో నిర్మించిన గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ప్రారంభించామని చెప్పారు. నగరంలో సేకరించిన చెత్తను ఇక్కడకు తీసుకొచ్చి ఇక్కడ వేరు చేస్తారన్నారు. ఇక్కడ నుంచి డంపింగ్ యార్డుకు తరలిస్తామని వెల్లడించారు. గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం 17వ డివిజన్‌లోని పోస్టల్ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించిన పశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. నగరంలో ఆవులు అధికంగా ఉన్నాయని, నగర ప్రజలకు ఇబ్బందులు కలుగ చేస్తున్న వాటిని ఇక్కడకు తీసుకొచ్చి సంరక్షణ కేంద్రంలో ఉంచుతామన్నారు. తరువాత దక్షిణ బైపాస్‌లోని 19వ డివిజన్‌లో రూ.15.60 లక్షలతో నిర్మించిన కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహం చుట్టూ నిర్మాణం పూర్తి చేసుకున్న పార్కును ప్రారంభించారు. కాసు బ్రహ్మానంద రెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వైద్యానికి పెద్దపీట..

రూ.లక్షల కోట్లు ఖర్చుచేసి ప్రభుత్వ విద్యను ఎంతగానో ప్రోత్సహిస్తున్నామని, అదేవిధంగా వైద్యానికి కూడా అదే తరహాలో ప్రోత్సహిస్తున్నామని బాలినేని పేర్కొన్నారు. 9వ డివిజన్‌లో రూ.1.50 కోట్ల వ్యయ అంచనాలతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. రాజీవ్ గృహకల్ప ఏరియాలో ఈ అర్బన్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయటం వల్ల కొప్పోలు రోడ్డులోని ప్రజలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. అదేవిధంగా 9వ డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప 6వ లైన్‌లో రూ.40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, మేయర్ గంగాడ సుజాతతో కలిసి కేక్ కట్ చేసిన బాలినేని అందరికీ పంచిపెట్టారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దటంతో పాటు జగనన్న హరిత నగరాల్లో భాగంగా పచ్చదనంతో నగరాన్ని నింపుతున్నామన్నారు. ఈ నెల 19వ తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును కొత్తగా ప్రారంభించిన అర్బన్ హెల్త్ సెంటర్‌లోనే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు కూడా మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవ రావు, వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ మహిళా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, పార్టీ నాయకులు కఠారి శంకర్, గంటా రామానాయుడు, బొమ్మినేని మురళి, కార్పొరేటర్లు వెన్నపూస శోభారాణి వెంకట రెడ్డి, నాగం వెంకట శేషయ్య, యనమల నాగరాజు, ఈదర సురేష్, ఆదిపూడి గిరిజాశంకర శాండిల్య, ఎందేటి పద్మావతి రంగారావు, చింతపల్లి గోపీచంద్, పసుపులేటి శ్రీనివాసరావు, వేమూరి మాల్యాద్రి, ప్రవీణ్ కుమార్, తన్నీరు నాగజ్యోతి నాగేశ్వరరావు, గోపిరెడ్డి గోపాల్ రెడ్డి, బెంగుళూరు నర్సయ్య, పార్టీ నాయకులు బొట్ల సుబ్బారావు, పాలపర్తి సుబ్బారావు, చింతగుంట్ల సువర్ణ, పున్నయ్య, మరియమ్మ, పూర్ణ చంద్రా రెడ్డి, ఎంతఃజానీ, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య, డీఈలు గణపతి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



19వ డివిజన్‌లో అర్బన్ హెల్త్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత తదితరులు



కొత్తమామిడిపాలెంలో గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్ ఆవరణలో మొక్క నాటుతున్న బాలినేని

వయోవృద్ధులు అనుభవజ్ఞులు



ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమంలో వృద్ధులను సన్మానిస్తున్న డీఆర్‌ఓ శ్రీలత తదితరులు

- వారి సంక్షేమానికి ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయి
- డీఆర్‌ఓ శ్రీలత, సివిల్ జడ్జి శ్యాంబాబు

ఒంగోలు అర్బన్: వయోవృద్ధులు అంటే కేవలం వయసు పైబడిన వారు మాత్రమే కాదని, సామాజిక, జీవిత అనుభవజ్ఞులని జిల్లా రెవెన్యూ అధికారి రామిశెట్టి శ్రీలత, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సివిల్ జడ్జి కే శ్యాంబాబులు అన్నారు. శనివారం స్పందన భవనంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆ శాఖ సహాయ సంచాలకులు అర్చన అధ్యక్షతన వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరైన డీఆర్‌ఓ, సివిల్ జడ్జిలు విశిష్ట సేవలు అందించిన వయోవృద్ధులను సత్కరించారు. కార్యక్రమానికి హాజరైన వృద్ధులకు చేతికర్రలు అందజేశారు. వృద్ధుల సంక్షేమానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను వివరించారు. దీనిలో డీఆర్‌డీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా సైనిక సంక్షేమ అధికారి, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు వెంకటేశ్వర్లు, కూరపాటి సుబ్బారావు, కంచర్ల సుబ్బారావు, కంటి వైద్యులు చలమయ్య, న్యాయవాది సరళాదేవి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్య యోగం

ఇండియన్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒంగోలులోని మినీ స్టేడియంలో యోగ, సూర్యనమస్కారాల సాధన కార్యక్రమంలో కలెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు. - 8లో..

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న శిద్దా సుధీర్


అవార్డు అందుకుంటున్న శిద్దా సుధీర్‌కుమార్

ఒంగోలు: రాష్ట్రస్థాయి ఔట్ స్టాండింగ్ బిజినెస్ ఎంటర్‌ప్రెన్యూర్ అవార్డును శిద్దా వెంకట సుదీర్‌కుమార్ శనివారం అందుకున్నారు. విశాఖపట్నంలోని కాకతీయ కన్వెన్షన్ హాలులో నిర్వహించిన జేసీఐ ధృవ జోన్ కాన్ 2023 కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శిద్దా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అవార్డుకు తనను ఎంపికచేయడం ఆనందంగా ఉందన్నారు. జేసీఐ అమలుచేసే సామాజిక సేవ కార్యక్రమాలకు చేయూత అందించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జేసీఐ ఒంగోలు పాస్ట్ నేషనల్ ప్రెసిడెంట్ నైనాల రామకృష్ణ, ఏపీ ఎలికో లిమిటెడ్ చైర్మన్ రమేష్ దాట్ల, జేసీఐ జాతీయ అధ్యక్షుడు కేవీ రత్నం, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

ఒంగోలు: స్థానిక డీఎస్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లను ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కళ్యాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన విద్యార్థినులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కాలేజీలో సంప్రదించాలని సూచించారు. కాలేజీ వారే మొదటి సంవత్సరం వరకు పూర్తి ఉచితంగా ట్యూషన్ ఫీజు చెల్లిస్తారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కాలేజీ ఆవరణలోనే ఉచిత హాస్టల్ వసతి ఉందన్నారు. కొన్ని కోర్సులకు మాత్రమే ఈ అవకాశం ఉందని, అంతేగాకుండా విద్యార్థినుల మేధస్సు పెంచేందుకు జవహర్ నాలెడ్జి సెంటర్ ద్వారా కూడా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు.

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా అరెస్ట్


మాట్లాడుతున్న సీఐ రంగనాథ్

సింగరాయకొండ: ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తూ ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరు ముఠా సభ్యులను శుక్రవారం రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో అరెస్టు చేసినట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ ఎస్పీ మల్లికా గర్గ్ ఆదేశాలతో ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామి పర్యవేక్షణలో క్రికెట్ ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ క్రమంలో క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్న ముఠా సభ్యులు మండలంలోని మూలగుంటపాడు పంచాయతీకి చెందిన అమరావతి రోడ్ లోని నరాల ప్రసాద్, గౌతమబుద్ధ రోడ్డులోని ఎం. శ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద 99 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్నా.. సహకరిస్తుస్తున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ముఠా గుట్టు రట్టవడంతో మండలంలోని క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు సుమారు 20 మందికి పైగా పరారయ్యారని సమాచారం.

యోగతో ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం

- చిన్నారులతో కలిసి యోగసాధనలో పాల్గొన్న కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్



యోగ చేస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ మరియు అధికారులు, విద్యార్థినీ,విద్యార్థులు

ఒంగోలు: యోగ సాధన ద్వారా ఆరోగ్యంతోపాటు ప్రతి ఒక్కరిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. స్థానిక పర్వతరెడ్డి ఆనంద్ మినీ స్టేడియంలో ఇండియన్ యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగ, సూర్యనమస్కారాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చిన్నారులతో కలిసి యోగసాధనతోపాటు సూర్య నమస్కారాలు సాధన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగ సాధన ద్వారా మనలో క్రమశిక్షణ పెరుగుతుందన్నారు. విద్యార్థి దశనుంచే ప్రతి ఒక్కరూ యోగ సాధన చేయాలన్నారు. ప్రస్తుతం ఒంగోలు మండలంలోని విద్యార్థులతో మాత్రమే నిర్వహించామని, వచ్చే ఫిబ్రవరిలో నాలుగు మండలాల్లోని 2 వేల మంది విద్యార్థులతో ఒంగోలులో భారీస్థాయిలో యోగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇండియన్ యోగ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పతంజలి శ్రీనివాస్ మాట్లాడుతూ యోగ సాధనకు, 108 పర్యాయాల సూర్య నమస్కారాల కార్యక్రమానికి సుమారు 600 మంది విద్యార్థులు పాల్గొని సాధన చేయడం ఆరోగ్య పెంపుదలలో ఒక ముందడుగుగా భావిస్తున్నామన్నారు. మూడు నెలలుగా విద్యార్థులకు యోగాసనాలలో శిక్షణ ఇచ్చామని, 108 పర్యాయాలు సూర్య నమస్కారాలు చేయగలిగిన విద్యార్థులను గుర్తించి ఈ కార్యక్రమానికి తీసుకొచ్చామని చెప్పారు. భవిష్యత్తులో మద్దిపాడు, కొత్తపట్నం, సంతనూతలపాడు మండలాల్లోను సూర్య యజ్ఞం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రవాణాశాఖ ఉపకమిషనర్ ఆర్.సుశీల, ఆయుష్ విభాగం రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మజాతి, ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ కె.చంద్రశేఖర్, యోగ శిక్షణ బృందం సభ్యులు తాతా ప్రసాద్, జనార్ధన్, కిరణ్, కిషోర్, జయలక్ష్మి, లీలా రాణి తదితరులు పాల్గొన్నారు.

20 గొర్రెలు మృతి

మార్కాపురం రూరల్: మండలంలోని గజ్జలకొండ గ్రామానికి చెందిన పశువుల కాపరి మేడబోయిన కాశయ్యకు చెందిన 20 గొర్రెలు శుక్రవారం సాయంత్రం మృతి చెందాయి. విషయం తెలుసుకున్న గజ్జలకొండ ఇన్‌చార్జి పశువైద్యాధికారి లీనాగ్రేస్ శనివారం వాటిని పరిశీలించారు. కలుషిత నీటిని తాగడం వలననే గొర్రెలు మృతి చెందినట్లు పశువుల కాపరి కాశయ్య పశువైద్యాధికారినికి ఫిర్యాదు చేశాడు. కాగా ప్రాథమిక గొర్రెల సహకార సంఘం సెక్రటరీ తిరుపతిరావు మృతి చెందిన గొర్రెలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వం గొర్రెల యజమానిని ఆదుకోవాలని ఆయన కోరారు. పశువైద్య సహాయకురాలు పి అనిత, సాయితేజ, రాజు, కోటి, తదితరులున్నారు.


మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న పశువైద్యాధికారి లీనా గ్రేస్

ఆర్టీసీకి జీవం జగన్

- 46 నెలల్లో రూ.13,800 కోట్లు ఆర్థిక సాయం
- పెన్షన్‌లేని ఆర్టీసీ కార్మికులు/ ఉద్యోగులకు జీపీఎస్ ఏర్పాటు చేస్తామనడం హర్షణీయం
- ఆర్టీసీ ఎన్ఎంయూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు

ఒంగోలు: ఆర్టీసీకి జీవం జగన్ అనే నినాదం ప్రస్తుతం కార్మికులు, ఉద్యోగుల్లో నెలకొందని ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆర్టీసీ ఎన్ఎంయూ అసోసియేషన్ విజయోత్సవ సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీని ప్రభుత్వంలో కలుపుతామని ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీని మొదటి క్యాబినెట్‌లోనే ప్రవేశపెట్టి 2020 జనవరి 1వ తేదీనుంచి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు జీవితాంతం హృదయంలో ఉంచుకుంటారన్నారు. గతంలో ఆర్టీసీకి ఇవ్వాల్సిన ప్రయోజనాలకు సైతం 50 శాతం ఇస్తామని ఒప్పందం చేసుకుని ఇవ్వని ముఖ్యమంత్రులను చూశామన్నారు. ఇంకో వైపు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి టాక్స్ భారాన్ని తగ్గించడంతో పాటు రూ.500 కోట్లు కేటాయిస్తే పదేళ్లపాటు ఆర్టీసీ ఆర్థిక ఒడిదుడుకులను తట్టుకుని నిలబడిందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు నేటికీ ఆయనపై అభిమానం చెక్కుచెదరదని చెప్పారు. ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెలకు రూ.300 కోట్లు చొప్పున 46 నెలలుగా రూ.13,800 కోట్లు జీతాల రూపంలో కార్మికులు, ఉద్యోగులకు చెల్లించి ఆర్టీసీకి అండగా నిలిచారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు పీవీ రమణారెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు ఎటువంటి పెన్షన్‌లేని ఆర్టీసీ ఉద్యోగులను ఆదుకునేందుకు జీపీఎస్ పెన్షన్ తీసుకురావడాన్ని ఆర్టీసీలోని ప్రతి ఉద్యోగి హర్షిస్తున్నారని, దీనిని త్వరగా అమలుచేయాలని సీఎంకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన తరువాత కార్మిక యూనియన్లు లేకపోవడంతో అధికారుల హవా కొనసాగిందని, దీనివల్ల ఎంతోమంది చిన్న చిన్న కారణాలతో ఉన్నతాధికారుల వేధింపులకు గురయ్యారన్నారు. సీఎం జగన్ ఆదేశాలతో నేడు ఆర్టీసీలో అసోసియేషన్లకు గుర్తింపు వచ్చిందని, దీనివల్ల ఉన్నతాధికారులతో ఉద్యోగుల సమస్యలపై చర్చించేందుకు అవకాశం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు పరిమితి లేని వైద్య సేవలు ఉచితంగా అందించాలన్నారు. 2019లో 1/19 జీవో విడుదలైనా చైల్డ్ కేర్ లీవ్‌ను డిపోల్లో అమలు చేయడంలేదని, దానిని కూడా అధికారులు తప్పనిసరిగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు ఆర్టీసీ ఉద్యోగులు యూనియన్ రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.అంజయ్య, జిల్లా కార్యదర్శి ఎస్ ప్రసాదరావు, జోనల్ కార్యదర్శి లుక్సన్, రాష్ట్ర కార్యదర్శి వైఎస్ ప్రసాద్, జిల్లా చైర్మన్ బొబ్బా శివాజీతోపాటు జిల్లాలోని అయిదు డిపోల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సెజ్‌లో ఎగుమతులు పెంచుకోవాలి

- వైజాగ్ సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ శ్రీనివాస్


ఫ్యాక్టరీని తనిఖీ చేస్తున్న వైజాగ్ సెజ్ కమిషనర్ శ్రీనివాస్

మద్దిపాడు: సెజ్‌లో గ్రానైట్ ఎగుమతులు పెంచుకోవాలని వైజాగ్ సెజ్ డెవలప్‌మెంట్ కమిషనర్ ముప్పాల శ్రీనివాస్ కోరారు. మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో ఉన్న సెజ్‌ను శనివారం ఆయన సందర్శించారు. సెజ్ పరిధిలో ఉన్న క్వార్జ్, క్రాఫ్ట్, జ్యోతి గ్రానైట్ పరిశ్రమలను సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. మిషనరీ భద్రతా ప్రమాణాలు, కార్మికుల పనితీరు, గ్రానైట్ ప్రాసెసింగ్, కటింగ్ పాలిషింగ్ యూనిట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఫ్యాక్టరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెజ్ పరిధిలో ఉన్న పరిశ్రమలకు సంబంధించిన సమస్యలు తెలపాలని కోరారు. ఫ్యాక్టరీల సమస్యలను తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌ఘడ్‌లో 30 శాతం పెరుగుదల ఉందని, ప్రకాశం జిల్లాలోని గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్ సెజ్ కూడా పుంజుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రానైట్ ఫ్యాక్టరీల పనితీరు, నిర్వహణ, ఎగుమతుల విధానం సంతృప్తికరంగా ఉందన్నారు. అనంతరం ఆయన ఫ్యాక్టరీ యజమానులతో ముఖాముఖి నిర్వహించగా, స్టేట్ మైనింగ్ విభాగంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, సెజ్ పరిధిలో వాటర్ క్లీనింగ్, పవర్ సమస్యలు ఉన్నాయని పలువురు యజమానులు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కమిషనర్.. ఏపీఐఐసీ చైర్మన్‌తో మాట్లాడి సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డెవలప్‌మెంట్ కమిషనర్ కేవీ ప్రసన్నకుమార్, స్పెసిఫైడ్ ఆఫీసర్ మహమ్మద్ అస్లాం ఉస్మాని, ప్రివెంటివ్ ఆఫీసర్ వంశీ, రాఘవేంద్ర సత్య గ్రానైట్స్ ఓనర్ సుధాకర్, అంజలీ గ్రానైట్స్ ఓనర్ మహేష్, జ్యోతి రాక్స్ శ్రావణ్, పలు ఫ్యాక్టరీల యజమానులు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరిస్తోంది

- దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ సత్యనారాయణ
- గుంటూరులో అర్చకుల సమస్యలపై సమీక్ష సమావేశం

గుంటూరు ఈస్ట్: రాష్ట్రంలో అర్చకుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు చేపడుతోందని దేవదాయశాఖ రాష్ట్ర కమిషనర్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. గుంటూరులోని కొత్తపేట దేవదాయశాఖ కార్యాలయంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అర్చకుల సమస్యలపై అధికారులతో శనివారం కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. అనువంశిక అర్చకుల పరిరక్షణే ధ్యేయంగా వారి పేర్లు నమోదు చేసుకోవడం జరుగుతోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1,539 మంది అర్చకులను గుర్తించామన్నారు. రూ.5 లక్షల్లోపు ఆదాయం ఉన్న దేవాలయాల్లో ఫౌండర్ ట్రస్టీ లేక అనువంశిక అర్చకులకు ఆలయ నిర్వహణ అప్పజెప్పడం జరుగుతోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 250 మంది అర్చకులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. జోన్ పరిధిలో 39 మంది అర్చకులు దరఖాస్తు చేసుకున్నారని వెల్లడించారు. ధూపదీప నైవేద్యం కింద 4,700 దేవాలయాలకు రూ.5 వేలు ఇస్తున్నామన్నారు. కనీస వేతనం రూ.3,205 మందికి ఇవ్వడం జరుగుతోందని చెప్పారు. ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అన్నవరం, కాణిపాకం తదితర దేవాలయాల తరఫున ధర్మ ప్రచార రథాలు నిర్వహిస్తున్నామన్నారు. సింహాచలం, విజయవాడ, శ్రీశైలం తదితర పెద్ద దేవాలయాల్లో ధర్మ ప్రచార మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. 6ఏ పరిధిలోని దేవాలయాల్లో వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. రైతు భరోసా కింద అర్చకుల పేర్ల నమోదుకు కలెక్టర్లతో మాట్లాడి సమన్వయంతో పనిచేసి అర్చకులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్చకుల భూములు అడంగల్‌లో అనుభవదారులుగా పేర్లు చేర్చే కార్యక్రమం కొనసాగుతోందన్నారు. పలువురు అర్చక సమాఖ్య నాయకులు, అర్చకులు సమస్యలను కమిషనర్‌కు నేరుగా తెలియజేశారు. కమిషనర్ స్పందించి సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌జేసీ సాగర్ బాబు, డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ మహేశ్వరరెడ్డి, అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రేయబాబు, గుంటూరు ప్రతినిధి అనంతాచార్యులు, డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు, ఈఓలు, అర్చకులు పాల్గొన్నారు.

బత్తాయి మొక్కలు ధ్వంసం


పీకేసిన బత్తాయి మొక్కలను పరిశీలిస్తున్న ఎస్ఐ

కొనకనమిట్ల: మండల కేంద్రం కొనకనమిట్లకు చెందిన యక్కంటి తిరుపతిరెడ్డికి చెందిన 3 ఎకరాల్లోని బత్తాయి తోటలోని అర మొక్కలను అదే గ్రామానికి చెందిన ధర్మరాజుల గురవయ్య, గురుస్వామి, కె.అజయ్ పీకి ధ్వంసం చేసినట్లు బాధితుడు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన పొలం పక్కన ఉన్న కొనకనమిట్లకు చెందిన ధర్మరాజుల గురవయ్య, ముసలయ్యలకు చెందిన ఉమ్మడి భూమి 0.50 సెంట్లు కొనగోలు నిమిత్తం వారికి అడ్వాన్సుగా రూ.50 వేలు ఇచ్చానన్నారు. సదరు భూమిలో బత్తాయి, మిరప పంట సాగు చేశానని.. అయితే భూమిని రిజిస్టర్ చేయకుండా తనను ఇబ్బందులు పెడుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా శుక్రవారం ధర్మరాజుల గురవయ్య, గురుస్వామి, వారి బంధువైన కె.అజయ్‌లు పొలంలో ఎవరూ లేని సమయంలో వెళ్లి కత్తులతో అర ఎకరాలోని బత్తాయి మొక్కలను, మిరప పంటను ధ్వంసం చేశారని చెప్పాడు. సుమారు రూ. 40 వేల వరకు నష్టం జరిగిందని తిరుపతిరెడ్డి ఆందోళన వ్యక్తం చేశాడు. ఎస్ఐ బ్రహ్మనాయుడు పొలంలోకి వెళ్లి బత్తాయి, మిరప పంటలను పరిశీలించారు. జరిగిన ఘటనపై కేసు నమోదు చేసి విచారించనున్నట్లు తెలిపారు.

వెన్నూరు విద్యార్థులకు మోదీ ప్రశంసలు


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్ఎం భారతి

కొండపి (సింగరాయకొండ): కొండపి మండలం వెన్నూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు, ఉపాధ్యాయునికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసా పత్రాలు పంపినట్లు ప్రధానోపాధ్యాయురాలు డి.భారతి తెలిపారు. గత విద్యా సంవత్సరం చివరలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాఠశాల విద్యార్థులతో పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహించారని, దీనిపై విద్యార్థులు టీచర్ కోనూరి హనుమంతరావు పర్యవేక్షణలో డాక్యుమెంట్ తయారు చేసి ప్రధానమంత్రి కార్యాలయానికి పంపారన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రధానమంత్రి కార్యాలయం నుంచి పాఠశాల 10వ తరగతి విద్యార్థినులు టి. గౌరీదేవి, పి.వర్షిణి, ఉపాధ్యాయుడు హనుమంతరావుకు ప్రశంసాపత్రాలు వచ్చాయని ఆమె వివరించారు. శనివారం పాఠశాలలో జరిగిన అభినందన సభలో విద్యార్థినులను, ఉపాధ్యాయుడు హనుమంతరావును ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యేకంగా అభినందించారు. వీరిద్దరినీ ఆదర్శంగా తీసుకుని విద్యార్థులంతా తమ ప్రతిభ మెరుగు పరచుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు డి.భారతి ఆశాభావం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో టీవీ మెకానిక్ మృతి


మృతి చెందిన పఠాన్ మొహమ్మద్ ఖాన్

ఒంగోలు సబర్బన్: నగరంలోని ఉత్తర బైపాస్‌లో శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఒంగోలు తాలూకా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాల్ నగర్‌కు చెందిన టీవీ మెకానిక్ పఠాన్ మొహమ్మద్ ఖాన్ త్రోవగుంట వైపు నుంచి రాంగ్‌రూట్‌లో ఒంగోలుకు వస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపుకు వెళుతున్న కారు.. ముందు వెళుతున్న మరో వాహనాన్ని దాటుకొని వెళుతున్న సందర్భంలో ఒక్కసారిగా ఎదురుగా వచ్చిన మోటార్ సైకిల్‌ను బలంగా ఢీకొంది. దీంతో పఠాన్ మొహమ్మద్ ఖాన్ ఎగిరి పక్కన ఉన్న డివైడర్ మధ్యలో పడిపోయాడు. తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు రోడ్డుపై పడి ఉన్న మోటారు సైకిల్‌ను పక్కకు తీశారు. పంచానామా అనంతరం మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘాట్‌లో తిరగబడిన లారీ


వేములపాడు ఘాట్ రోడ్డు చత్రాల వద్ద తిరగబడిన సిమెంట్ దిమ్మెల లోడు లారీ


పరిశీలిస్తున్న హెచ్ఎంపాడు పోలీసులు

- క్లీనర్ మృతి
- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

హనుమంతునిపాడు: మండల పరిధి వేములపాడు ఘాట్ రోడ్డు వద్ద నంద్యాల ఒంగోలు రహదారి చత్రాల వద్ద సిమెంట్ దిమ్మెల లోడు లారీ బోల్తా కొట్టిన సంఘన శనివారం రాత్రి జరిగింది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు. ఈ ప్రమాదంలో క్లీనర్ తాళ్ల సుబ్బారావు (30) అక్కడికక్కడే చనిపోయాడు. డ్రైవర్ నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఓ లారీ రైల్వే ట్రాక్‌కు వేసే సిమెంట్ దిమ్మెల లోడుతో కర్ణాటక రాష్ట్రం నుంచి లోడుతో దర్శి వస్తోంది. నంద్యాలా ఒంగోలు రహదారిలో హనుమంతునిపాడు మండలం వేములపాడు సమీపాన చత్రాల మలుపు వద్ద లారీ అదుబు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్ కాళ్ల సుబ్బారావు అక్కడికక్కడే మృతి చెందాడు. లోపల ఇరుక పోయి చేయి కనిపిస్తోంది. డ్రైవర్ నర్సయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహన ద్వారా పొదిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. డ్రైవర్‌ది ఏలూరు, మృతుడు క్లీనర్‌ది ఏలూరు వద్ద నల్లజర్ల గ్రామం. అతి వేగంగా నడపడం వలనే ప్రమాదం జరిగినట్లు ఉంది. మృత దేహాన్ని జేసీబీతో తొలగించి వెలికి తీసేకుందు ప్రయత్నం చేస్తున్నట్లు ఎస్సై కె.శివనాగరాజు తెలిపారు.

విద్యార్థుల కోసం ఇస్తున్న శిక్షణ భేష్


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న రమేష్‌కుమార్

సింగరాయకొండ: మండల కేంద్రంలోని శ్రీరాం నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు అందిస్తున్న టీచింగ్ ఎయిడ్స్ బాగున్నాయని జిల్లా ఎస్ఎస్ఏ అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి ఎం.రమేష్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా రమణమూర్తిలో కాస్ట్ నో కాస్ట్ పర్మినెంట్ టీచింగ్ ఎయిడ్స్‌ను పరిశీలించి వీటిని తయారు చేసిన హెచ్ఎం టి. సుజాత, ఉపాధ్యాయుడు ఎం.ప్రభాకరరెడ్డిని ప్రశంసించారు. జిల్లా స్థాయిలో రామచంద్ర మిషన్‌లో జరుగుతున్న లీడర్ షిప్ శిక్షణ కార్యక్రమంలో పాఠశాలలోని టీచింగ్ ఎయిడ్స్‌ను ప్రదర్శించాలని ఉపాధ్యాయుడు ప్రభాకరరెడ్డికి సూచించారు. తర్వాత విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.